www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత: UDYAMA KERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 150 | 25-11-2026 | బుధవారం | పేజీలు: 8 | వెల : రూ.2/-

భారత్ నుంచి స్వదేశానికి హసీనా



- సంకెళ్లతో తీసుకొస్తామన్న బంగ్లాదేశ్ మంత్రి!
- డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌కు వెళ్తున్న షేక్ హసీనా..
- హైవేల దిగ్బంధానికి పిలుపునిచ్చిన అవామీ లీగ్..

4

కలెక్టర్‌కే వేధింపులు.. హైకోర్టు ఆగ్రహం

- మహిళా కలెక్టర్‌కు అసభ్య సందేశాలు పంపినట్లు ఆరోపణలు
- టీవీకే ఎమ్మెల్యేపై ఎఫ్ఐఆర్

4



ప్రధాని మోదీకి జర్మనీ ఛాన్సలర్ మెర్జ్ ఫోన్..

4



కాంగ్రెస్‌లో అసమ్మతి సెగలు
సందీప్‌కు సవాళ్లు!

కాంగ్రెస్‌లో క్రమశిక్షణ గాడిన పడేనా?



- కొత్త ఇన్‌చార్జి బీఎం సందీప్‌కు తొలి పర్యటనలోనే సవాళ్లు
- మంత్రులతో విడివిడిగా సమీక్షా సమావేశాలు
- బహిరంగ విమర్శలతో పార్టీకి ఇబ్బందులు
- రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తికి పరిష్కారం దొరికేనా?
- పార్టీ, ప్రభుత్వ మధ్య సమన్వయంపై దృష్టి

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు, నేతల మధ్య సమన్వయ లోపం, క్రమశిక్షణ ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేయడం కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జి బీఎం సందీప్‌కు ప్రధాన సవాల్‌గా మారింది. రాష్ట్ర వ్యవహారాల బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి హైదరాబాద్‌కు వచ్చిన ఆయన గాంధీభవన్‌లో వరుస సమావేశాలు నిర్వహించారు. మీనాక్షి నటరాజన్ స్థానంలో నియమితులైన సందీప్, పొలిటికల్ అఫైర్స్ కమిటీతో సమావేశం కావడంతో పాటు మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మలతో విడివిడిగా చర్చలు జరిపారు. అయితే, తొలి పర్యటనలో ఆయన చేసిన సూచనలు గతంలో ఇన్‌ఛార్జులుగా పనిచేసినవారు చెప్పిన అంశాలకే పరిమితమయ్యాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

హైదరాబాద్, నవంబర్ 24 (ఉద్యమ కెరటం): తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు, నేతల మధ్య సమన్వయ లోపం, క్రమశిక్షణ ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేయడం కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జి బీఎం సందీప్‌కు ప్రధాన సవాల్‌గా మారింది. రాష్ట్ర వ్యవహారాల బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి హైదరాబాద్‌కు వచ్చిన ఆయన గాంధీభవన్‌లో వరుస సమావేశాలు నిర్వహించారు. మీనాక్షి నటరాజన్ స్థానంలో నియమితులైన సందీప్.. పొలిటికల్ అఫైర్స్ కమిటీతో సమావేశం కావడంతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో విడివిడిగా చర్చలు జరిపారు. అయితే, తొలి మిగతా 2 లో



అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు..
వేగం పెంచాలి!

- జనవరిలో మూసీ పునరుజ్జీవం తొలి దశ పనులు
- రేడియల్ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి
- సమగ్ర అధ్యయనంతో పీఆర్‌ఆర్‌ఎస్‌కు ప్రణాళికలు
- మిరాలం చెరువులో పూడిక తొలగించాలి
- నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీపడొద్దు
- మున్సిపల్, పట్టణాభివృద్ధిపై సీఎం సమీక్ష

2

క్యూర్, ప్యూర్ ప్రాంతాల్లో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖల పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి వాటికి సంబంధించి స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధిపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షించారు. మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్ల పురోగతిని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు ఫేజ్-1లో భాగంగా హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.20 కి.మీ ప్రాంతాన్ని జోన్-1 ఏ గా, ఉస్మాన్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కి.మీ ప్రాంతాన్ని జోన్-1 బీ గా విభజించి పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.



సెప్టిక్ ట్యాంక్‌లో ముగిసిన మూడు ప్రాణాలు!

బాచుపల్లిలో ముగ్గురు యువ పారిశుద్ధ్య కార్మికుల మృతి

విషవాయువులు, ప్రాణవాయువు కొరతపై అనుమానాలు

భద్రతా ప్రమాణాల అమలుపై పోలీసుల ఆరా

మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం

2

కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు



- 26న అచ్చంపేటలో ప్రారంభం
- స్థానిక నేత కార్మికులకు ఉపాధి కల్పించేలా తయారీ
- రేషన్‌కార్డులో 18 ఏళ్లు నిండిన మహిళలకు పంపిణీ

2

డ్రగ్స్ రహిత భారత్ కోసం
ప్రజా ఉద్యమం

- నేటి నుంచి 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర
- అంబర్‌పేట నుంచి ఫిల్మ్‌నగర్ వరకు కార్యక్రమం
- 2029 చివరి నాటికి డ్రగ్స్ నియంత్రణ లక్ష్యం
- యువతను క్రీడల వైపు మళ్లించాలి: కిషన్‌రెడ్డి

3



3

ఇంటర్ ప్రాక్టికల్స్‌లో జంబ్లింగ్ లేనట్టే!

- సొంత కళాశాలల్లోనే ప్రాక్టికల్ పరీక్షలు
- తెలంగాణ ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం
- ప్రథమ సంవత్సరం విద్యార్థులకూ ప్రాక్టికల్స్
- జనవరి 29 నుంచి పరీక్షలు ప్రారంభం
- రోజుకు రెండు విడతల్లో పరీక్షల నిర్వహణ

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు 10 వేల కోట్ల కార్యాచరణ!

- ఐదు నెలలపాటు నెలకు రూ.2 వేల కోట్లతో పనులు
- చెరువులు, వాగులు, కాలువల పునరుద్ధరణకు ప్రాధాన్యం
- నీటి సంరక్షణతోపాటు గ్రామీణ ప్రజలకు ఉపాధి
- ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి
- ఏడాదికి సరిపడా బియ్యం నిల్వలు సిద్ధం
- తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ ఏర్పాట్లపై ఉత్తమ్ సమీక్ష



ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే సంభావ్య కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రూ.10 వేల కోట్ల అంచనాతో ఐదు నెలల ప్రత్యేక కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సంక్రాంతి అనంతరం ప్రతి నెలా రూ.2 వేల కోట్ల విలువైన పనులు చేపట్టాలని ప్రతిపాదించినట్లు తెలిపారు.

2



ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్రీగా రిజిస్ట్రేషన్

- ఏడాదిలోపు నిర్మాణాలు పూర్తి
- 26 నియోజకవర్గాల్లో టవర్ల నిర్మాణం
- రెరాలో నమోదైన తొలి ప్రభుత్వ గృహ ప్రాజెక్టు

2

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



సెప్టిక్ ట్యాంక్‌లో ముగిసిన మూడు ప్రాణాలు!

బాచుపల్లిలో ముగ్గురు యువ పారిశుద్ధ్య కార్మికుల మృతి

విషవాయువులు, ప్రాణవాయువు కొరతపై అనుమానాలు

హైదరాబాద్, నవంబర్ 24 (ఉద్యమ కెరటం): బతుకుదెరువు కోసం సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు దిగిన ముగ్గురు యువ కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్‌లోని బాచుపల్లి దినేశ్ ఆరిక్ అపార్ట్‌మెంట్స్‌లో మంగళవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. మృతులను సుమన్ (24), సురేష్ (25), పవన్ (25)గా పోలీసులు గుర్తించారు. వీరంతా సెప్టిక్ ట్యాంకులను శుభ్రపరిచే ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు లోపలికి దిగిన కార్మికులు ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టి ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ట్యాంక్‌లో పేరుకుపోయిన విషవాయువులు లేదా ప్రాణవాయువు కొరత కారణంగా ఊపిరాడక కార్మికులు మృతి చెంది ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే పోస్టుమార్టం నివేదిక అనంతరమే మృతికి కచ్చితమైన కారణాలు వెల్లడికానున్నాయి. ట్యాంక్‌లోకి దిగే ముందు విషవాయువుల తీవ్రతను పరీక్షించారా? కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు అందించారా? అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ముగ్గురు యువ కార్మికుల మృతితో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదకరమైన పారిశుద్ధ్య పనుల్లో కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు రూ.10 వేల కోట్ల కార్యాచరణ!

ఐదు నెలలపాటు నెలకు రూ.2 వేల కోట్లతో పనులు

చెరువులు, వాగులు, కాలువల పునరుద్ధరణకు ప్రాధాన్యం

నీటి సంరక్షణతోపాటు గ్రామీణ ప్రజలకు ఉపాధి

తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 24 (ఉద్యమ కెరటం): ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే సంభావ్య కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రూ.10 వేల కోట్ల అంచనాతో ఐదు నెలల ప్రత్యేక కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సంక్రాంతి అనంతరం ప్రతి నెలా రూ.2 వేల కోట్ల విలువైన పనులు చేపట్టాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. తెలంగాణ పెట్టుబడుల సదస్సులో భాగంగా నిర్వహించనున్న క్లైమేట్ కాంక్లేవ్ ఏర్పాట్లపై మంగళవారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్లకు శాస్త్రీయ, ఆచరణాత్మక పరిష్కారాలను సూచించే వేదికగా ఈ సదస్సు నిలవాలని ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఎల్‌నినో సన్నద్ధత కార్యక్రమాన్ని సదస్సులో ప్రత్యేకంగా ప్రదర్శించనున్నట్లు మంత్రి తెలిపారు. నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో చెరువులు, వాగులు, కాలువల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణ, గ్రామీణ నీటి వనరుల పరిరక్షణకు సంబంధించిన పనులు చేపట్టనున్నట్లు వివరించారు. వ్యవసాయ పనులు తగ్గే కాలంలో గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడం కూడా ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కరువు పరిస్థితులు తలెత్తినా ప్రజలకు తాగునీరు, ఆహార భద్రత కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సదస్సులో వివరించాలని మంత్రి సూచించారు. వచ్చే వర్షాకాలం వరకు జలాశయాల్లో నీటి నిల్వలను కాపాడేందుకు అధిక నీరు అవసరమయ్యే వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాలకు ఏడాదిపాటు సరిపడా బియ్యం నిల్వలు రాష్ట్రంలో ఉన్నాయని వెల్లడించారు. పంట దిగుబడులు తగ్గినా ఆహార భద్రతకు ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిల్వలు ఉపయోగపడతాయన్నారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విస్తరణ, శుద్ధి చేసిన మురుగునీటిని పరిశ్రమల్లో వినియోగించడం, నికర సున్నా కర్బన ఉద్గారాల లక్ష్య సాధనపైనా సమీక్షలో చర్చించారు. రాష్ట్రంలోని డేటా సెంటర్లు తమ విద్యుత్ అవసరాల్లో కనీసం 51 శాతాన్ని పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి సమకూర్చుకోవాలనే నిబంధన అమల్లో ఉందని అధికారులు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన వాతావరణ అనుకూల నమూనాలతోపాటు ఇక్రిశాట్ గుర్తించిన ఉత్తమ విధానాలను సదస్సులో ప్రదర్శించాలని మంత్రి సూచించారు. ఈ సదస్సులో పర్యావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, పెట్టుబడిదారులతోపాటు సర్పంచ్‌లు సహా సుమారు 125 మంది గ్రామీణ ప్రతినిధులను భాగస్వాములను చేయనున్నారు. నీటి భద్రత, సుస్థిర వ్యవసాయం, జీవవైవిధ్య పరిరక్షణ, పట్టణ ఉష్ణోగ్రతల నియంత్రణ, స్వచ్ఛ ఇంధనం తదితర అంశాలపై విస్తృత చర్చలు నిర్వహించనున్నారు. పర్యావరణ పర్యాటకం, గ్రీన్ క్రెడిట్లు, వ్యర్థాల పునర్వినియోగం, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయనున్నారు. సమీక్షలో రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టీజీ ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణభాస్కర్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో అసమ్మతి సెగలు.. సందీప్‌కు సవాళ్లు!

మొదటి పేజీ తరువాయి

పర్యటనలో ఆయన చేసిన సూచనలు గతంలో ఇన్‌ఛార్జులుగా పనిచేసినవారు చెప్పిన అంశాలకే పరిమితమయ్యాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నేతలంతా ఐక్యంగా పనిచేయాలని, విభేదాలను పక్కనపెట్టి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు కృషి చేయాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్‌లో నెలకొన్న పరిస్థితులకు కేవలం ఐక్యతా సందేశాలు సరిపోతాయా? నేతల వ్యవహారశైలిలో మార్పు తీసుకొచ్చేందుకు ఎలాంటి చర్యలు చేపడతారన్నది చర్చనీయాంశంగా మారింది.

అదుపు తప్పుతున్న నేతల వ్యవహారశైలి

తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రస్తుతం ఐక్యతతో పాటు పార్టీ క్రమశిక్షణను కాపాడటం కూడా పెద్ద సమస్యగా మారింది. అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే సొంత పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు ప్రభుత్వ పనితీరుపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేయడం అధిష్ఠానానికి ఇబ్బందిగా పరిణమించింది. ముఖ్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పలుమార్లు బహిరంగ వేదికలపై చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. ప్రభుత్వ నిర్ణయాలు, పాలనా విధానాలపై సొంత పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేయడంతో ప్రతిపక్షాలకు విమర్శలు చేసేందుకు అవకాశం లభిస్తోంది. పార్టీ అంతర్గతంగా చర్చించి పరిష్కరించుకోవాల్సిన అంశాలు మీడియా, సామాజిక మాధ్యమాల్లో ప్రధాన చర్చలుగా మారుతున్నాయి. దీంతో కాంగ్రెస్ నాయకత్వం క్రమశిక్షణ విషయంలో ఎలాంటి వైఖరి అవలంబిస్తుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

రాజగోపాల్‌రెడ్డి విషయంలో ఎలాంటి నిర్ణయం?

బహిరంగంగా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న నేతలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించడం కొత్త ఇన్‌ఛార్జికి తక్షణ కర్తవ్యంగా మారింది. కేవలం ఐక్యత గురించి మాట్లాడటం కాకుండా, పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరించే నాయకుల విషయంలో ఒక స్పష్టమైన విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ద్వారా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి సందేశం పంపి, బీఎం సందీప్‌తో సమావేశం కావాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తికి గల కారణాలను తెలుసుకుని, ఆయనను పార్టీ వ్యవహారాల్లో సమన్వయం చేసే ప్రయత్నం జరగవచ్చని భావిస్తున్నారు. అయితే, ఈ తరహా చర్చలు నేతలను బుజ్జగించడంతోనే ముగుస్తాయా? లేక పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునే దిశగా అధిష్ఠానం ముందడుగు వేస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.



పార్టీ, ప్రభుత్వ మధ్య సమన్వయమే కీలకం

రాష్ట్ర కాంగ్రెస్‌లో పార్టీ నాయకత్వానికి, ప్రభుత్వానికి మధ్య సమన్వయం తీసుకురావడం కూడా బీఎం సందీప్ ముందున్న కీలక బాధ్యత. నల్గొండ జిల్లాకు చెందిన కీలక నేతల మధ్య విభేదాలు, మంత్రుల మధ్య సమన్వయ లోపం వంటి అంశాలు పరిష్కారం కావాల్సి ఉంది. ప్రభుత్వ నిర్ణయాలు, పార్టీ కార్యక్రమాలు, రాజకీయ వ్యూహాల విషయంలో నాయకులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. గతంలో రాష్ట్ర ఇన్‌ఛార్జులుగా పనిచేసినవారు సమీక్షా సమావేశాలు నిర్వహించడం, నేతల అభిప్రాయాలు సేకరించడం, అధిష్ఠానానికి నివేదికలు అందించడంతోనే పరిమితమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు బీఎం సందీప్ కూడా అదే విధానాన్ని అనుసరిస్తారా? లేక విభేదాల పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణ రూపొందించి అమలు చేస్తారా? అన్నది చూడాల్సి ఉంది. ఢిల్లీ అధిష్ఠానం మార్గదర్శకత్వంలో పార్టీ క్రమశిక్షణను పునరుద్ధరించడం, అసంతృప్త నేతలతో చర్చలు జరపడం, ప్రభుత్వానికి పార్టీకి మధ్య సమన్వయం పెంచడం వంటి అంశాలపై ఆయన తీసుకునే నిర్ణయాలపైనే రాష్ట్ర కాంగ్రెస్‌లో తదుపరి పరిణామాలు ఆధారపడి ఉండనున్నాయి.

అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు.. వేగం పెంచాలి!

జనవరిలో మూసీ పునరుజ్జీవం తొలి దశ పనులు

రేడియల్ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

సమగ్ర అధ్యయనంతో పీఆర్టీఎస్‌కు ప్రణాళికలు

మిరాలం చెరువులో పూడిక తొలగించాలి

నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీపడొద్దు

మున్సిపల్, పట్టణాభివృద్ధిపై సీఎం సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 24 (ఉద్యమ కెరటం) : క్యూర్, ప్యూర్ ప్రాంతాల్లో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖల పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి వాటికి సంబంధించి స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధిపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షించారు. మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్ల పురోగతిని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు ఫేజ్-1లో భాగంగా హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.20 కి.మీ ప్రాంతాన్ని జోన్-1 ఏ గా, ఉస్మాన్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కి.మీ ప్రాంతాన్ని జోన్-1 బీ గా విభజించి పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. జనవరి 2027 లో ఫేజ్-1 పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, ఇప్పటికే ఫేజ్-1 టెండర్ల ప్రక్రియను ప్రారంభించినట్లు వివరించారు. మిరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల పురోగతిపై సీఎం ఆరా తీశారు. జనవరి 2028 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు అధికారులు తెలిపారు. మిరాలం చెరువు అభివృద్ధితోపాటు చెరువులో ఎంతో కాలంగా పేరుకుపోయిన పూడికను తొలగించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రేడియల్ రోడ్ల నిర్మాణం, భూసేకరణ పురోగతిని అధికారులు వివరించగా రేడియల్ రోడ్ల నిర్మాణంలో పనులను మరింత వేగం పెంచాలని సూచించారు. గండిపేట వద్ద నిర్మాణంలో ఉన్న ఆధునిక గోశాల పనుల పురోగతిని ఆరా తీసిన ముఖ్యమంత్రి మార్చి 2027 నాటికి పూర్తి చేసేలా పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో పీఆర్టీఎస్(పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం) ఫేజ్-1 కు సంబంధించి టెక్నో ఎకానమీ ఫీజిబిలిటీన గురించి అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. కూకట్‌పల్లి నుంచి రాయదుర్గ్ మీదుగా బయో డైవర్సిటీ వరకు అలైన్‌మెంట్ సాధ్యాసాధ్యాలను, బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి సెక్రటేరియట్, బషీర్‌బాగ్ మీదుగా రాణీగంజ్ వరకు అలైన్‌మెంట్ ప్రతిపాదనల గురించి అధికారులు వివరించారు. దీంతోపాటు నెక్లెస్ రోడ్, రాయదుర్గ్, పీపుల్స్ ప్లాజా పరిసరాల్లో పీఆర్టీఎస్ డిపోలను నిర్మించేందుకు అనువైన స్థలాలను గుర్తించి, సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. డిపో పరిసరాల్లో మల్టీ లెవెల్ పార్కింగ్ ఉండేందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. రూట్స్, డిపోల నిర్మాణం, ఇతర అంశాలపై పూర్తిస్థాయి అధ్యయనం చేసిన తర్వాత ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ పరిధిలో ఐఐఐటీ జంక్షన్ వద్ద ఫుట్ బ్రిడ్జికి సంబంధించి పలు డిజైన్లను కమిషనర్ ముఖ్యమంత్రికి చూపించగా పరిశీలించిన ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఫుట్‌బ్రిడ్జి సమీపంలో ప్రధానంగా మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. కోహెడలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ అభివృద్ధి పనుల పురోగతి గురించి తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. మార్కెట్ అభివృద్ధి పనులతో మెరుగైనా రవాణా సౌకర్యం కోసం సమాంతరంగా రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలో చెరువుల పునరుద్ధరణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు సంబంధించిన పనుల వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. చెరువుల పునరుద్ధరణలో భాగంగా అవసరమైనచోట ఎస్టీపీల ఏర్పాటు ప్రతిపాదనలను హైడ్రా కమిషనర్ వివరించారు. ఎస్టీపీల నిర్మాణం వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నగరంలో మెట్ట బావుల పునరుద్ధరణ విషయంలోనూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, సీఎంసీ కమిషనర్ శ్రీజన, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎఫ్‌సిడిఏ కమిషనర్ శశాంక, హెచ్ ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీ ఎండీ అశోక్ రెడ్డి, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ నర్సింహ రెడ్డి, హెచ్‌జీసీఎల్ ఎండీ ఉపేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్రీగా రిజిస్ట్రేషన్

ఏడాదిలోపు నిర్మాణాలు పూర్తి : 26 నియోజకవర్గాల్లో టవర్ల నిర్మాణం

హైదరాబాద్, నవంబర్ 24 (ఉద్యమ కెరటం): హైదరాబాద్ మహానగరంలో పేదల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఒక్కో లబ్ధిదారుడికి రూ.50 నుంచి రూ.60 లక్షల విలువైన ఆస్తిని అందించనున్నట్లు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఇళ్లను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి అప్పగిస్తామని తెలిపారు. ప్రభుత్వ గృహ నిర్మాణ ప్రాజెక్టు తొలిసారిగా తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ రెరా)లో నమోదు కావడం పారదర్శక పాలనకు నిదర్శనమని మంగళవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇళ్ల అప్పగింత వరకు ప్రతి దశలో పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి తెలిపారు. శంకుస్థాపన జరిగిన ఏడాదిలోపు టవర్ల నిర్మాణం పూర్తి చేసి ఇళ్లను అందజేస్తామని చెప్పారు. రెరాలో నమోదు కావడంతో నిర్మాణాల్లో జాప్యం జరిగినా, నిబంధనలు ఉల్లంఘించినా లబ్ధిదారులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదులపై రెరా బిల్డర్లకు నోటీసులు జారీ చేయడంతో పాటు, సరైన వివరణ ఇవ్వకపోతే జరిమానాలు విధించే అవకాశం ఉంటుందని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపట్టగా, ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో పనులు ప్రారంభమయ్యాయి. ఒక్కో నియోజకవర్గంలో నాలుగు టవర్లు, ఒక్కో టవర్‌లో 120 ఫ్లాట్ల చొప్పున మొత్తం 480 ఫ్లాట్లు నిర్మించనున్నారు. ఒక్కో ఫ్లాట్ నిర్మాణ వ్యయం రూ.11 లక్షలు కాగా, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుంది. మిగిలిన రూ.6 లక్షలను లబ్ధిదారులు నాలుగు విడతల్లో చెల్లించాలి. నిధుల వినియోగంలో పారదర్శకత కోసం ప్రతి నియోజకవర్గానికి హౌసింగ్ బోర్డు, బిల్డర్, లబ్ధిదారుల పేర్లతో మూడు ప్రత్యేక ఎస్క్రో బ్యాంకు ఖాతాలు ఏర్పాటు చేశారు. నిర్మాణ పనుల పురోగతిని అనుసరించి బిల్డర్లకు నిధులు విడుదల చేయనున్నారు. ఇందిరమ్మ టవర్స్ ప్రాజెక్టులకు సంబంధించిన రెరా అనుమతి పత్రాలను సోమవారం రెరా చైర్మన్ శ్రీనివాసరాజు నుంచి హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వీపీ గౌతమ్ అందుకున్నారు. ఈ నమోదు వల్ల ప్రాజెక్టులపై లబ్ధిదారులకు మరింత విశ్వాసం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు

హైదరాబాద్, నవంబర్ 24: తెలంగాణలోని మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఇందిరమ్మ చీరలను అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు కోటి చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ నెల 26న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. గతంలోనూ మహిళలకు చీరలు పంపిణీ చేసిన ప్రభుత్వం.. తాజాగా రెండో విడతలో భారీ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా అర్హులైన మహిళలందరికీ చీరలు అందించేలా పంపిణీ ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం కోటి చీరల్లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు 65 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో నివసించే మహిళలకు 35 లక్షలు కేటాయించారు. మహిళల అభిరుచులను దృష్టిలో పెట్టుకుని ఆకర్షణీయమైన చిలుకపచ్చ రంగులో వీటిని రూపొందించారు. చీరల తయారీలో నాణ్యత, మన్నికకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక డిజైన్లను ఎంపిక చేశారు. ఆధునిక అభిరుచులకు సరిపోయేలా రూపొందించడంతో పాటు సంప్రదాయ పద్ధతుల్లోనూ ధరించేందుకు అనువుగా రెండు రకాల చీరలను సిద్ధం చేశారు. పంపిణీ చేయనున్న కోటి చీరల్లో 95 లక్షలు పాలిస్టర్‌తో తయారు చేయగా, ఒక్కోటి 6.30 మీటర్ల పొడవు ఉండనున్నాయి. మిగిలిన ఐదు లక్షల చీరలను పాలీకాటన్ వస్త్రంతో 9 మీటర్ల పొడవులో రూపొందించారు. మహిళలకు నచ్చేలా విభిన్న డిజైన్లతో వీటిని సిద్ధం చేశారు. ఈ చీరల తయారీ బాధ్యతలను రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన నేత కార్మికులకు అప్పగించారు. ప్రభుత్వ కానుకగా మహిళలకు చీరలు అందించడంతోపాటు చేనేత, నేత కార్మికులకు పని కల్పించి వారి ఆర్థిక పరిస్థితికి చేయూతనివ్వాలన్నది ఈ కార్యక్రమం వెనుక ఉన్న మరో ఉద్దేశం. రేషన్‌కార్డు కలిగిన కుటుంబాల్లో 18 ఏళ్లు పూర్తయిన మహిళలందరినీ ఈ పథకానికి అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. అర్హత ఉన్నవారు తమ ఆహార భద్రత కార్డు, ఆధార్ వివరాలను చూపించి చీరలను తీసుకోవచ్చు. జిల్లా కలెక్టర్లు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల పర్యవేక్షణలో పంపిణీ ప్రక్రియ కొనసాగనుంది. గ్రామాలు, పట్టణాల్లో వార్డుల వారీగా ప్రజాప్రతినిధుల సమక్షంలో సెర్ప్ సిబ్బంది లబ్ధిదారులకు చీరలను అందజేయనున్నారు. పంపిణీలో పారదర్శకతను పాటించడంతో పాటు అర్హులైన వారికే చీరలు చేరేలా ప్రత్యేక మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో లబ్ధిదారుల వివరాలను నమోదు చేయనున్నారు. ఈ నెల 26న అచ్చంపేటలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభమయ్యే కార్యక్రమం అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు చీరల పంపిణీ చేపట్టనున్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షణ రక్షిత
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

అసమ్మతి ఎమ్మెల్యేలకు సందీప్ హితవు

- ప్రభుత్వంపై బహిరంగ విమర్శలు చేయొద్దు
- సమస్యలుంటే నేరుగా నా దృష్టికి తీసుకురండి
- రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డితో విడివిడిగా సమావేశం
- అభివృద్ధి నిధుల కేటాయింపు, అధికారుల అవినీతిపై ఎమ్మెల్యేల అసంతృప్తి
- రాజగోపాల్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు ఓ వర్గం నేతల ఒత్తిడి
- తాజా పరిణామాలతో కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ



హైదరాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): సొంత ప్రభుత్వంపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రాష్ట్ర వ్యవహారాల నూతన ఇన్‌ఛార్జి బీఎం సందీప్ కీలక సూచనలు చేశారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మంగళవారం రాత్రి సందీప్‌తో విడివిడిగా సమావేశమయ్యారు. ఇటీవల తాము చేసిన వ్యాఖ్యలకు సంబంధించి వివరణ ఇచ్చినట్లు సమాచారం. ప్రభుత్వ పనితీరుపై అభ్యంతరాలుంటే బహిరంగంగా విమర్శలు చేయకుండా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సందీప్ సూచించినట్లు తెలిసింది. రాష్ట్రంలోని పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి, పార్టీ నాయకులతో చర్చించిన అనంతరం సమస్యలపై స్పందిస్తానని స్పష్టం చేసినట్లు సమాచారం. ఎమ్మెల్యేలతో భేటీకి ముందే టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవితో సందీప్ చర్చలు జరిపారు. రాజగోపాల్‌రెడ్డి హద్దులు దాటి వ్యవహరించారని, ఆయన విషయంలో ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుందని మల్లు రవి ఇప్పటికే పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై పదేపదే విమర్శలు చేస్తున్న రాజగోపాల్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పార్టీలోని ఓ వర్గం నాయకులు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అభివృద్ధి నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై రాజగోపాల్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. మరోవైపు కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులకు కొందరు అధికారులు భారీగా కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. అధికారుల అవినీతి కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటోందని విమర్శించారు. ఈ నెల 19న సిద్దిపేటలో జరిగిన బహిరంగ సభలో అసమ్మతి ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారికి పిచ్చికుక్కలు కరిచాయని, పార్టీ శ్రేణులే మానసిక వైద్యశాలకు తీసుకెళ్తారని వ్యాఖ్యానించారు. దీనిపై మరుసటి రోజు సామాజిక మాధ్యమాల వేదికగా రాజగోపాల్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. ఉన్నత పదవుల్లో ఉన్నవారు హుందాగా మాట్లాడాలని, అధికార మదంతో ఇష్టానుసారం వ్యవహరిస్తే ప్రజలు హర్షించరని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కక్షపూరిత పాలన సాగించేవారిని ప్రజలు, చరిత్ర క్షమించబోవని విమర్శించారు. ఈ పరిణామాల నేపథ్యంలో అసమ్మతి ఎమ్మెల్యేలతో సందీప్ నిర్వహించిన సమావేశాలకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం చూపడంతోపాటు బహిరంగ విమర్శలకు అడ్డుకట్ట వేసేందుకు అధిష్ఠానం ఎలాంటి చర్యలు చేపడుతుందన్నది కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.



డ్రగ్స్ రహిత భారత్ కోసం ప్రజా ఉద్యమం

నేటి నుంచి 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర

అంబర్‌పేట నుంచి ఫిల్మ్‌నగర్ వరకు కార్యక్రమం

2029 చివరి నాటికి డ్రగ్స్ నియంత్రణ లక్ష్యం

యువతను క్రీడల వైపు మళ్లించాలి: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 24: దేశంలో మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుతో పాటు దేశ అభివృద్ధికి ముప్పుగా మారుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నవంబర్ 25 నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. పంజాబ్‌తో పాటు ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోనూ మాదకద్రవ్యాల సమస్య విస్తరిస్తోందని తెలిపారు. డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చే డబ్బును దేశ వ్యతిరేక కార్యకలాపాలు, ఉగ్రవాదానికి వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో డ్రగ్స్ నియంత్రణకు పోలీసులు, ముఖ్యంగా ఈగల్ బృందాలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. వాటి కార్యకలాపాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. 2029 చివరి నాటికి మాదకద్రవ్యాల సమస్యను పూర్తిస్థాయిలో నియంత్రించాలనే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విదేశాల నుంచి డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఇతర దేశాలతో ఒప్పందాలు చేసుకుంటున్నామని, నిఘా సంస్థలు కూడా అంతర్జాతీయ స్థాయిలో చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు. యువతను వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు క్రీడలను ప్రోత్సహించాలని కిషన్‌రెడ్డి సూచించారు. తెలంగాణలో మరిన్ని క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నవంబర్ 25న అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర 27వ తేదీ సాయంత్రం ఫిల్మ్‌నగర్‌లో ముగుస్తుందని తెలిపారు. ఇది రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న తొలి విడత కార్యక్రమమని, ఇందులో పాల్గొనాలని పోలీస్ కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులను ఆహ్వానించినట్లు చెప్పారు.

ప్రపంచ వేదికపై తెలంగాణ సత్తా చాటేలా గ్లోబల్ సమ్మిట్

డిసెంబర్ 7 నుంచి 9 వరకు ప్రపంచ పెట్టుబడుల సదస్సు

1,500 మందికిపైగా సీఈవోలు, పెట్టుబడిదారుల రాక

భారత్ ఫ్యూచర్ సిటీలో పనులను పరిశీలించిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ బ్రాండ్ ప్రతిష్ఠను మరింత పెంచేలా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'ను నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. బుధవారం హైదరాబాద్ శివారులోని భారత్ ఫ్యూచర్ సిటీలో సదస్సు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేదిక నిర్మాణం, ప్రదర్శన ప్రాంగణాలు, భద్రతా ఏర్పాట్లు, రవాణా నిర్వహణ, అతిథుల వసతి తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తెలంగాణ పారిశ్రామిక, ఆర్థిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఈ సదస్సు కీలక వేదికగా నిలవనుందని మంత్రి పేర్కొన్నారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఈ సదస్సు జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా 1,500 మందికిపైగా సీఈవోలు, పెట్టుబడిదారులు, దౌత్యవేత్తలు హాజరుకానున్నారు. రక్షణ, ఔషధ తయారీ, గేమింగ్, కృత్రిమ మేధ తదితర కీలక రంగాలకు చెందిన వెయ్యికిపైగా సంస్థల భాగస్వామ్యంతో బహుళ రంగాల ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధుల భద్రత కోసం ముఖ గుర్తింపు వ్యవస్థ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు తెలంగాణలోని పారిశ్రామిక అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుంది.



నీళ్ల విషయంలో రేవంత్ పచ్చి అబద్ధాలు

- కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణకు సాగునీటి హక్కులు
- పాలమూరులో 10 లక్షల ఎకరాలకు బీఆర్ఎస్ నీళ్లిచ్చింది
- ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం
- కృష్ణా జలాల వాటాపై తాత్కాలిక ఒప్పందమే
- రేవంత్ వ్యాఖ్యలకు ఆధారాలతో సమాధానం చెబుతాం
- బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 24 (ఉద్యమ కెరటం): తెలంగాణ సాగునీటి హక్కులు, ప్రాజెక్టులు, కృష్ణా జలాల వాటా విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన పోరాటాన్ని తప్పుబట్టడం దారుణమన్నారు. కాంగ్రెస్, టీడీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేసి లక్షల ఎకరాలకు నీరందించిందని చెప్పారు. ఉమ్మడి పాలనలో పాలమూరుకు కేవలం 30 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందితే, కేసీఆర్ ప్రభుత్వం కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ తదితర పథకాల ద్వారా 10 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చిందన్నారు. పాలమూరు ప్రాజెక్టులపై రూ.30 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో 75 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. కుప్పంకు నీళ్లు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నా పాలమూరు రైతులకు సాగునీరు అందకపోవడంపై ప్రశ్నించారు.



కాళేశ్వరం, ఎల్లంపల్లి, అన్నారం, సుందిళ్ల, సమ్మక్క సాగర్, సీతమ్మ సాగర్ వంటి ప్రాజెక్టుల నిర్మాణం, పెండింగ్ పనుల పూర్తి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందన్నారు. మిషన్ కాకతీయ, చెక్‌డ్యాంలు, కొత్త ప్రాజెక్టుల నిర్మాణంతోనే 2021-22లో తెలంగాణ వరి ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానానికి చేరిందని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం మూడేళ్లలో ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క టీఎంసీ సామర్థ్యం ఉన్న కొత్త రిజర్వాయర్ కూడా నిర్మించలేదని విమర్శించారు. పల్నాడు వాటర్ గ్రిడ్, బనకచర్ల ప్రాజెక్టుల విషయంలోనూ రేవంత్ తప్పుడు వివరాలు చెబుతున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఏపీ ప్రాజెక్టులపై బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలోనే అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ లేఖలు రాసిందని గుర్తుచేశారు. పల్నాడు ప్రాజెక్టుకు 2025 జనవరిలో టెండర్లు పిలిచినా తెలంగాణ ప్రభుత్వం స్పందించలేదని, విషయం వెలుగులోకి వచ్చిన తర్వాతే లేఖలు రాసిందని విమర్శించారు. నాగార్జునసాగర్ నుంచి 1.865 టీఎంసీల నీటిని తీసుకునే అంశం కొత్త జీవోలో ఉందని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. కృష్ణా జలాల 299:512 టీఎంసీల వాటా విషయంలోనూ కాంగ్రెస్ నాయకులే గతంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. 2015 ఒప్పందం శాశ్వతమైనది కాదని, ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు తాత్కాలికంగా అమలయ్యే ఏర్పాటేనని స్పష్టం చేశారు. తెలంగాణకు న్యాయమైన వాటా కోసం కేసీఆర్ కేంద్రాన్ని పలుమార్లు కోరారని, ట్రిబ్యునల్ ఏర్పాటు కోసం పోరాడారని తెలిపారు. 50:50 నిష్పత్తిలో నీటి వినియోగం కొనసాగించాలని 30కి పైగా లేఖలు రాసినట్లు పేర్కొన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 19 లేఖలు రాసిందని, కేఆర్ఎంబీ, అపెక్స్ కౌన్సిల్ సమావేశాల్లోనూ వ్యతిరేకించిందని తెలిపారు. 2020 జనవరి నుంచే ఈ ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తం చేశామని, కేసీఆర్ కేంద్ర జలశక్తి మంత్రికి కూడా లేఖ రాశారని చెప్పారు. రేవంత్‌రెడ్డి మాత్రం కేసీఆర్ ఈ ప్రాజెక్టుకు అంగీకరించారని చెప్పడం పూర్తిగా అవాస్తవమన్నారు. పోతిరెడ్డిపాడు విస్తరణపై కూడా బీఆర్ఎస్ గతంలో అసెంబ్లీలో పోరాటం చేసిందని గుర్తుచేశారు. నీటి వినియోగ గణాంకాలను కూడా రేవంత్‌రెడ్డి తనకు అనుకూలంగా వక్రీకరిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. 2024-25లో ఏపీ 718 టీఎంసీలు, తెలంగాణ 286 టీఎంసీలు వినియోగించగా, 2025-26లో ఏపీ 771 టీఎంసీలు, తెలంగాణ 267 టీఎంసీలు మాత్రమే వాడుకున్నాయని తెలిపారు. తెలంగాణ నీటి వినియోగం చరిత్రలోనే అత్యల్ప స్థాయికి పడిపోయిందని ఆరోపించారు. దేవాదుల, సీతారామ, కల్వకుర్తి తదితర ఎత్తిపోతల పథకాలను ఎన్ని రోజులు నడిపించారో ప్రభుత్వం వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు సాగునీరు, తాగునీరు అందించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని, మిషన్ భగీరథ దేశానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ప్రాజెక్టుల అనుమతులు సాధించడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నీటి అంశాలపై అసెంబ్లీలో వారం, పది రోజుల పాటు చర్చకు సిద్ధంగా ఉన్నామని, రేవంత్‌రెడ్డి కూడా సిద్ధం కావాలని సవాల్ విసిరారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సహాయకుడి అకాల మరణంతో కేసీఆర్ దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తిగత సహాయకుడు మహేందర్ రెడ్డి దుర్మరణం

అంత్యక్రియలకు హాజరై పాడె మోసిన మాజీ ఎంపీ సంతోష్ కుమార్

హైదరాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన వ్యక్తిగత సహాయకుడు మహేందర్ రెడ్డి మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహేందర్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం తెలిసిందే. అతడి మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు. మహేందర్ రెడ్డి మరణవార్త తెలియగానే కేసీఆర్ తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. వెంటనే అంత్యక్రియల ఏర్పాట్లను దగ్గరుండి చూసుకోవాలని మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్‌ను ఆదేశించారు. అధినేత ఆదేశాల మేరకు సంతోష్ కుమార్, ఇతర పార్టీ నేతలు, కేసీఆర్ వ్యక్తిగత సిబ్బందితో కలిసి మహేందర్ రెడ్డి స్వగ్రామమైన బందనకల్‌కు చేరుకున్నారు. అక్కడ మహేందర్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో సంతోష్ కుమార్ స్వయంగా పాడె మోశారు. మహేందర్ రెడ్డితో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. శోకసంద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ, మహేందర్ రెడ్డి కుటుంబాన్ని కేసీఆర్ అన్ని విధాలుగా ఆదుకుంటారని స్పష్టం చేశారు. మహేందర్ రెడ్డికి తండ్రి, చెల్లెలు, నాయనమ్మ ఉన్నారని, వారి బాధ్యతను పార్టీ తీసుకుంటుందని తెలిపారు. మహేందర్ రెడ్డి సోదరి చదువుతో పాటు ఆమె వివాహ బాధ్యతలను స్వయంగా కేసీఆరే చూసుకుంటారని వెల్లడించారు. అలాగే తండ్రి, నాయనమ్మల ఆరోగ్య బాగోగులను కూడా కేసీఆర్ స్వయంగా పర్యవేక్షిస్తారని ఆయన కుటుంబానికి హామీ ఇచ్చారు. ఈ అంత్యక్రియల కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ ఎంపీపీ జనగామ శరత్ రావు, నేతలు అంజిరెడ్డి, జుబేర్, కేసీఆర్ వ్యక్తిగత కార్యదర్శి (పీఎస్) నాగేందర్ రెడ్డితో పాటు పలువురు కార్యాలయ సిబ్బంది, స్థానిక పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

ఎన్నికల వేళ కొత్త పొత్తులు.. సీట్ల సర్దుబాట్లు!

- ఆరేళ్ల తర్వాత మళ్లీ ఎన్డీయే గూటికి అకాలీదళ్
- పంజాబ్ ఎన్నికల్లో బీజేపీ, అకాలీదళ్ కలిసి పోటీ



న్యూఢిల్లీ, నవంబర్ 24 (ఉద్యమ కెరటం): వచ్చే ఏడాది జరగనున్న పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల మధ్య పొత్తులు, సీట్ల సర్దుబాటు చర్చలు ఊపందుకున్నాయి. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత శిరోమణి అకాలీదళ్ తిరిగి ఎన్డీయే కూటమిలో చేరింది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, అకాలీదళ్ కలిసి పోటీ చేయనున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ప్రకటించారు. పంజాబ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం, అవినీతి నిర్మూలన, రైతుల సమస్యల పరిష్కారం, జాతీయవాద శక్తులను బలోపేతం చేయడం తమ కూటమి ప్రధాన లక్ష్యాలని వెల్లడించారు. మరోవైపు ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల మధ్య తొలి విడత సీట్ల సర్దుబాటు చర్చలు జరిగాయి. కాంగ్రెస్‌కు 26 అసెంబ్లీ స్థానాలను ప్రతిపాదించినట్లు సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ వెల్లడించారు. కాంగ్రెస్ మాత్రం వందకుపైగా స్థానాలను కోరుతున్నట్లు సమాచారం. దీంతో ఇరు పార్టీల మధ్య సీట్ల పంపకాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో మొత్తం 403 అసెంబ్లీ స్థానాలు ఉండగా, 2022 ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ 347 స్థానాల్లో పోటీ చేసి 111 చోట్ల విజయం సాధించింది. కాంగ్రెస్ 399 స్థానాల్లో బరిలోకి దిగి రెండు సీట్లకే పరిమితమైంది. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమిలో భాగంగా కలిసి పోటీ చేసిన రెండు పార్టీలు మెరుగైన ఫలితాలను సాధించాయి. అదే ఒరవడిని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొనసాగించేందుకు ఇరు పార్టీలు సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుపుతున్నాయి.

యూఏఈలో ఘోర రోడ్డు ప్రమాదం.. 13 మంది దుర్మరణం!

రాస్ అల్ ఖైమాలో బస్సు, ట్రక్కు ఢీ
మృతుల్లో భారతీయులు.. 14 మందికి గాయాలు
ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి
బాధిత కుటుంబాలకు భారత కాన్సులేట్ అండ
సహాయం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు



రాస్ అల్ ఖైమా, నవంబర్ 24 (ఉద్యమ కెరటం): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాస్ అల్ ఖైమాలోని అల్ వతన్ రహదారిపై ప్రయాణికుల బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది గాయపడ్డారు. మృతుల్లో భారతీయులు కూడా ఉన్నట్లు దుబాయ్‌లోని భారత కాన్సులేట్ వెల్లడించింది. అయితే ఎంతమంది భారతీయులు మరణించారనే వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. యూఏఈ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. 41 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు సాంకేతిక లోపంతో రహదారి పక్కన నిలిపి ఉన్న ట్రక్కును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తొలుత 11 మంది మరణించగా, తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 13కు చేరింది. ప్రమాదంలో భారతీయులు ప్రాణాలు కోల్పోవడంపై దుబాయ్‌లోని భారత కాన్సులేట్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. సహాయం కోసం 24 గంటలూ అందుబాటులో ఉండే టోల్‌ఫ్రీ నంబర్ 800-46342ను ప్రకటించింది. కాగా, ఈ నెల 13న యూఏఈలోని ఫుజైరాలో జరిగిన మరో ఘోర రోడ్డు ప్రమాదంలో 23 వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఆ ఘటనలో నలుగురు భారతీయులు సహా 14 మంది మరణించగా, ఏడుగురు భారతీయులు సహా 30 మంది గాయపడ్డారు. పక్షం రోజుల వ్యవధిలోనే మరో ఘోర ప్రమాదం చోటుచేసుకోవడం తీవ్ర విషాదాన్ని నింపింది.

లక్నోలో ఘనంగా ముగిసిన తహ్బీబ్ ఫెస్టివల్

ప్రత్యేక ఆకర్షణగా అంతర్జాతీయ ముషాయిరా



లక్నో, నవంబర్ 24 (ఉద్యమ కెరటం): సాహిత్యం, సంగీతం, కళలు, సంస్కృతుల సమ్మేళనంగా లక్నోలోని ఇంటిగ్రల్ యూనివర్సిటీలో మూడు రోజులపాటు నిర్వహించిన 'తహ్బీబ్ ఫెస్టివల్--2026' ఘనంగా ముగిసింది. తహ్బీబ్ గ్లోబల్ కన్వీనర్ తారిఖ్ ఫైజీ సమన్వయంతో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో సుమారు 25 వేల నుంచి 30 వేల మంది పాల్గొన్నారు. అంతర్జాతీయ ముషాయిరా వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ గజల్ గాయకుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ హరియోమ్ తన గజల్స్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఆయన ప్రదర్శనకు ముఖ్యంగా విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. దుబాయ్‌కు చెందిన ఎమిరాతీ కవి మహమ్మద్ అల్ హెబ్సీ తన అరబిక్ కవిత్వంతో సాహిత్యాభిమానులను అలరించారు. ఆయన కవితలకు హిందీ అనువాదాన్ని అందించడం ద్వారా భాషలకు అతీతంగా సాహిత్యాన్ని ప్రేక్షకులకు చేరువ చేశారు. ఆయన భాగస్వామ్యం భారత్--యూఏఈ సాంస్కృతిక, సాహిత్య సంబంధాలకు ప్రతీకగా నిలిచింది. దుబాయ్‌కు చెందిన దీబా ఇర్ఫాన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు, హస్తకళలు, వస్త్రాలంకరణ, జీవనశైలి, సృజనాత్మక ఉత్పత్తుల విక్రయశాలలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. యువత, విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం ఉత్సవాలకు మరింత శోభను తీసుకొచ్చింది. 'ప్రజలు-సంస్కృతులు-ఆలోచనలు' అనే నినాదంతో తహ్బీబ్ గ్లోబల్ సాహిత్యం, సంగీతం, కళలు, కవిత్వం ద్వారా అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహిస్తోంది. ఇంటిగ్రల్ యూనివర్సిటీ సహకారంతో నిర్వహించిన ఈ ఉత్సవం లక్నో చారిత్రక గంగా-జమునీ మిశ్రమ సంస్కృతిని అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పింది.

కలెక్టర్‌కే వేధింపులు
సర్కారుపై హైకోర్టు ఆగ్రహం!

మహిళా కలెక్టర్‌కు అసభ్య సందేశాలు పంపినట్లు ఆరోపణలు
టీవీకే ఎమ్మెల్యే అరుల్ విఘ్నేష్‌పై ఎఫ్ఐఆర్
రంగంలోకి దిగిన జాతీయ మహిళా కమిషన్



చెన్నై, నవంబర్ 24 (ఉద్యమ కెరటం): తమిళనాడులో మహిళా కలెక్టర్‌కు అసభ్యకర సందేశాలు పంపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికార టీవీకే ఎమ్మెల్యే సి. అరుల్ విఘ్నేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. కల్లకురిచ్చి జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తమిళనాడు మహిళలపై వేధింపుల నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు మద్రాస్ హైకోర్టుకు వెల్లడించారు. అయితే ఈ వ్యవహారంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జులై 31నే ప్రభుత్వానికి సమాచారం అందినప్పటికీ ఇంతకాలం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించింది. ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని కోరుతూ అన్నాడీఎంకే న్యాయవాది ఆర్. తిరిసూలి మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం జస్టిస్ లక్ష్మీనారాయణన్ ఎదుట ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. కలెక్టర్ నుంచి ఫిర్యాదు అందిందా అని న్యాయమూర్తి ప్రశ్నించగా, అప్పటివరకు పోలీసులకు గానీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి గానీ ఫిర్యాదు అందలేదని ప్రభుత్వ ప్రధాన క్రిమినల్ న్యాయవాది ఆర్. జాన్ సత్యన్ తెలిపారు. దీంతో కలెక్టర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సంప్రదించి వివరాలు సేకరించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ నేపథ్యంలో సోమవారం కల్లకురిచ్చి జిల్లా ఎస్పీకి కలెక్టర్ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యే తనతో అనుచితంగా ప్రవర్తించడంతోపాటు అవాంఛిత సందేశాలు పంపారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. మంగళవారం కేసు మరోసారి విచారణకు రాగా, ఎమ్మెల్యేపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ప్రభుత్వ న్యాయవాది లిఖితపూర్వక వివరణ సమర్పించారు. అయితే ప్రభుత్వ వివరణపై న్యాయస్థానం సంతృప్తి వ్యక్తం చేయలేదు. జులై 31నే ఈ వ్యవహారం ప్రభుత్వ దృష్టికి వచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని జస్టిస్ లక్ష్మీనారాయణన్ నిలదీశారు. ఎవరినైనా కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు చిన్న అనుమానం వచ్చినా సహించేది లేదని హెచ్చరించారు. ఆరోపణలపై విచారణ జరిపేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ స్పందనను నిశితంగా పరిశీలిస్తామని స్పష్టం చేశారు. మరోవైపు మహిళా కలెక్టర్‌కు ఎమ్మెల్యే అనుచిత సందేశాలు పంపినట్లు వెలువడిన కథనాలపై జాతీయ మహిళా కమిషన్ స్పందించింది. ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఎమ్మెల్యేపై కేసు నమోదు, ప్రభుత్వ తీరుపై హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలతో ఈ వ్యవహారం తమిళనాడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ప్రధాని మోదీకి జర్మనీ ఛాన్సలర్ మెర్జ్ ఫోన్..

ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ..



న్యూఢిల్లీ, నవంబర్ 24: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ మంగళవారం ఫోన్ చేశారు. ఈ సందర్భంగా భారత్-జర్మనీ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఇరుదేశాల నేతలు చర్చించారు. రక్షణ, అధునాతన సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారంపై మంతనాలు జరిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలు, ప్రపంచ శాంతి, స్థిరత్వానికి సంబంధించిన అంశాలపైనా అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రధానమంత్రి కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం.. భారత్-జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యంలో సాధించిన పురోగతిపై మోదీ, మెర్జ్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాదితో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించాలని ఇద్దరు నేతలు పునరుద్ఘాటించారు. ముఖ్యంగా రక్షణ రంగం, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వంటి కీలక రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కూడా చర్చకు వచ్చింది. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే ఇరుదేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని మోదీ, మెర్జ్ అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా మోదీ, మెర్జ్ చర్చించారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి, స్థిరత్వాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. అలాగే, ప్రస్తుత ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు బహుళపక్ష అంతర్జాతీయ వేదికలపై పరస్పర సహకారాన్ని కొనసాగించడం అవసరమని స్పష్టం చేశారు. తాజా ఫోన్ సంభాషణతో భారత్-జర్మనీ సంబంధాలను రక్షణ, సాంకేతికత, వాణిజ్యం, పెట్టుబడుల రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లాలన్న ఇరుదేశాల నిబద్ధత మరోసారి వెల్లడైంది. కాగా, సెప్టెంబర్ 10న కూడా ప్రధాని మోదీ, మెర్జ్ మధ్య ఫోన్ సంభాషణ జరిగింది.

మా షరతులకు ఒప్పుకుంటేనే చర్చలు!

అమెరికాకు ఇరాన్ స్పష్టీకరణ
యుద్ధానికి ముగింపు పలికేందుకు ఏడు షరతులు

టెహ్రాన్, నవంబర్ 24 (ఉద్యమ కెరటం): యుద్ధానికి ముగింపు పలికే విషయంలో తాము ప్రతిపాదించిన ఏడు షరతులకు అంగీకరించే వరకు అమెరికాతో చర్చలు జరిపేది లేదని ఇరాన్ స్పష్టం చేసింది. మంగళవారం ప్రభుత్వ ప్రసార మాధ్యమానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ గాలిబఫ్ ఈ మేరకు వెల్లడించారు. తమ షరతులకు అమెరికా అంగీకరిస్తేనే చర్చలు ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిలో అమెరికా సైనిక రక్షణలో ప్రయాణిస్తున్న మూడు చమురు ట్యాంకర్లను సముద్ర మందుపాతరలతో ముంచివేసినట్లు ఇరాన్ పేర్కొంది. అమెరికా తన వైఖరిని మార్చుకోకపోతే ఇటువంటి ఘటనలు పునరావృత మవుతాయని హెచ్చరించింది. అయితే ట్యాంకర్లపై దాడులకు సంబంధించిన ఇరాన్ ప్రకటనకు స్వతంత్ర నిర్ధారణ లేదు. చర్చలకు సంబంధించి ఇరాన్ విధించిన ఏడు షరతుల పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడి కాలేదు. అయితే ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయడం, ఓడరేవులపై అమెరికా విధించిన దిగ్బంధాన్ని తొలగించడం, స్వాధీనం చేసుకున్న ఇరాన్ ఆస్తులను తిరిగి అప్పగించడం వంటి అంశాలు ఆ జాబితాలో ఉన్నట్లు ఇరాన్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అమెరికా మొండివైఖరితో ముందుకెళ్తే తాము ప్రస్తుత పరిమితులను దాటి దాడులకు దిగుతామని ఇరాన్ హెచ్చరించింది.



భారత్ నుంచి స్వదేశానికి హసీనా

సంకెళ్లతో తీసుకొస్తామన్న బంగ్లాదేశ్ మంత్రి!
డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌కు వెళ్తున్న షేక్ హసీనా..
హైవేల బిగ్బంధానికి పిలుపునిచ్చిన అవామీ లీగ్..
సంకెళ్లతో తీసుకొస్తామన్న బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి



ఢాకా, నవంబర్ 24 (ఉద్యమ కెరటం): బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా డిసెంబర్ 16న స్వదేశానికి తిరిగి వెళ్తున్నారు. రెండేళ్లుగా భారత్‌లో నివసిస్తున్న ఆమె బంగ్లాదేశ్ వెళ్తున్నట్లు ఆమె అధికార ప్రతినిధి మంగళవారం ప్రకటించారు. హసీనా వస్తుండటంతో ఆమె పార్టీ అవామీలీగ్ సంబరాలు చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో 16న బంగ్లా జాతీయ రహదారుల్ని ఆక్రమిస్తామని ప్రకటించింది. ఆమెను ప్రజానాయకురాలిగా అభివర్ణిస్తూ అవామీలీగ్ ఫేస్‌బుక్‌లో కీలక ప్రకటన చేసింది. డిసెంబర్ 16నే బంగ్లాదేవ్ 1971 విమోచనయుద్ధ విజయ వార్షికోత్సవం, ఆ రోజునే స్వదేశానికి వెళ్లేందుకు షేక్ హసీనా ఎంచుకున్నారు . హసీనా బంగ్లా వస్తుండటంతో ఇప్పటికే ఆ దేశంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇది రాజకీయ, న్యాయపరమైన ఉద్రిక్తతలకు కారణమయ్యే అవకాశం ఉంది. షేక్ హసీనా తన పత్రాలను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయడమే కాకుండా, ప్రభుత్వ యాజమాన్యంలోని విమాన సంస్థ బిమాన్ బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్ ద్వారా తిరిగి రావడానికి ఏర్పాట్లు చేయాలని బంగ్లాద్ ప్రభుత్వాన్ని కోరారు. మరోవైపు, షేక్ హసీనా రాకపై అధికార బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్పీ), ఆ పార్టీ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. బంగ్లాదేశ్ విదేశాంగ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ మాట్లాడుతూ.. షేక్ హసీనా చేతులకు సంకెళ్లు వేసి, కట్టుదిట్టమైన భద్రత నడుమ బంగ్లాదేశ్ తీసుకువస్తామని అన్నారు. 2024లో హింసాత్మక ఉద్యమం తర్వాత షేక్ హసీనా తన ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్ వచ్చారు. ఈ హింసలో 1400 మంది మరణించారు. గతేడాది నవంబర్‌లో బంగ్లాదేశ్ యుద్ధ నేరాల న్యాయస్థానం హసీనాకు మరణశిక్ష విధించింది. ఆమె మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినట్లు ఆరోపించింది. అయితే, ఈ ఆరోపణల్ని హసీనా ఖండించారు.

పేద కుటుంబాలకు ఇందిరమ్మ జీవిత బీమా



ఉద్యమ కెరటం, బెజ్జూర్: మండలంలోని ప్రతి పేద కుటుంబానికి రూ.5లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ జీవిత బీమా పథకం అమలు చేస్తుందని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జగ్గా గౌడ్ తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న బీమా నమోదు కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఇందిరమ్మ జీవిత బీమా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ పథకంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు సమయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే కాంగ్రెస్ నాయకులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాహీర్ అలీ, కొట్రంగి రామకృష్ణ, పెద్దల శంకర్, జావిద్, శ్యామల కిరణ్ కుమార్, చిలుముల ప్రభాకర్, తునికి శంకర్, వార్డు సభ్యుడు రామడుగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోఆప్షన్ మెంబర్ పదవిపై కాంగ్రెస్ నాయకుల ఆశలు..

జైనూర్‌లో ఆసక్తికర చర్చ



ఉద్యమ కెరటం, జైనూర్: జైనూర్ మండల కేంద్రంలో కోఆప్షన్ మెంబర్ పదవిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. మండలంలో కోఆప్షన్ మెంబర్ పదవిని దక్కించుకునేందుకు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆసక్తి చూపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులకు పదవుల్లో అవకాశం కల్పించాలని ఆశావహులు భావిస్తున్నారు. ఈ క్రమంలో కోఆప్షన్ మెంబర్ పదవి తమకు దక్కుతుందనే ఆశతో పలువురు నాయకులు పార్టీ పెద్దల దృష్టికి తమ అభిప్రాయాలను తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. మండల స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న వారికి అవకాశం కల్పించాలని ఆశిస్తున్నారు. మరోవైపు ఈ పదవికి ఎవరిని ఎంపిక చేస్తారనే అంశంపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది. అయితే కోఆప్షన్ మెంబర్ పదవికి సంబంధించి పార్టీ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది. అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే ఈ పదవిపై స్పష్టత రానుంది.

పొలాల్లో అక్రమ విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



ఉద్యమ కెరటం, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో వ్యవసాయ పొలాల వద్ద వన్యప్రాణుల వేట కోసం అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హెచ్చరించారు. వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం, వన్యప్రాణులను చంపడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలతో అటవీ జంతువులతో పాటు వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల ప్రాణాలకు సైతం ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి అక్రమ చర్యలకు పాల్పడవద్దని, వన్యప్రాణుల వేటకు ప్రయత్నించే వారు కూడా ఇలాంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ప్రజలకు, వన్యప్రాణులకు హాని కలిగించినట్లు గుర్తిస్తే బాధ్యులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

చిల్డ్రన్ బ్యాంక్ నోట్లతో భారీ మోసం.. ముఠా గుట్టురట్టు

- ఆరుగురిపై కేసు నమోదు.. నలుగురు అరెస్ట్
- రూ.40 లక్షలకు పైగా విలువైన నకిలీ నోట్లు, నకిలీ 100 బంగారు నాణేలు స్వాధీనం



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో ముద్రించిన నోట్లను అసలైన కరెన్సీగా నమ్మిస్తూ ప్రజలను మోసం చేస్తున్న ముఠా గుట్టును ఆదిలాబాద్ జిల్లా పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో ఆరుగురిపై కేసు నమోదు కాగా, నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 99 కట్టల నకిలీ నోట్లు, 100 నకిలీ బంగారు నాణేలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.40 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలను వెల్లడించారు. ప్రధాన నిందితులు ఆత్రం పరశురామ్, మండలి బక్కన్న పూజలు, మంత్రతంత్రాలతో డబ్బులు రెట్టింపు చేస్తామని ప్రజలను నమ్మించి నగదు వసూలు చేసేవారని, అనంతరం అసలైన నోట్లకు బదులుగా చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో ముద్రించిన నోట్లను అందించి మోసాలకు పాల్పడేవారని సూచించారు. ఈ ముఠాకు సహకరిస్తున్న ఎంబడి మల్లేష్, చీటి తరుణ్, జమల్‌పూర్ సాయి కృష్ణ, పేంద్రం సురేష్‌లను అరెస్టు చేశారని తెలిపారు. మంచిర్యాల జిల్లాకు చెందిన బాధితుడి నుంచి పూజల పేరుతో మొత్తం రూ.8లక్షలు వసూలు చేసి మోసం చేసిన ఘటనపై ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని, విచారణలో ఈ ముఠా కార్యకలాపాలు వెలుగులోకి వచ్చాయన్నారు. నిందితులపై ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, హైదరాబాద్ జిల్లాల్లో పలు కేసులు నమోదైనట్లు తెలిపారు. మరో ఇద్దరు ప్రధాన నిందితులు ఇప్పటికే ఇచ్చోడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మరో కేసులో అరెస్టయి ఉన్నారని తెలిపారు. సుమారు 40 మంది బాధితులు ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. పూజలు, మంత్రతంత్రాలతో డబ్బులు రెట్టింపు చేస్తామని చెప్పేవారిని నమ్మవద్దని, కరెన్సీ కట్టలను స్వీకరించే సమయంలో జాగ్రత్తగా పరిశీలించాలని జిల్లా ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో పోలీసు అధికారులు ఉన్నారు.



పాఠాల ముసుగులో మతబోధన చేస్తున్నారంటూ ఆరోపణ

- సెంట్ క్లారెన్స్ పాఠశాలపై విద్యార్థి తండ్రి ఫిర్యాదు

ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్: పాఠాల ముసుగులో విద్యార్థులకు బైబిల్ అంశాలను తప్పనిసరిగా చదవాలని ఒత్తిడి చేస్తున్నారంటూ కాగజ్‌నగర్ మండలంలోని సెంట్ క్లారెన్స్ పాఠశాలపై ఆరోపణలు వ్యక్తమయ్యాయి. పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని బైబిల్‌లోని ఓ అంశాన్ని చదువుకొని రావాలని యాజమాన్యం ఆదేశించినట్లు విద్యార్థి తండ్రి ఆరోపించారు. ఈ విషయంపై యాజమాన్యాన్ని ప్రశ్నించగా, నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఘటనపై హిందూ జాగరణ మంచ్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు మంగళవారం మండల విద్యా శాఖ అధికారితో పాటు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విద్యార్థులపై బలవంతపు మతబోధన జరుగుతోందనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులపై మతపరమైన అంశాలను బలవంతంగా రుద్దడం సరికాదన్నారు. పాఠశాలలో జరిగిన ఘటనపై విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యా శాఖ అధికారులు పర్యవేక్షించాలని కోరారు. అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హిందూ జాగరణ మంచ్ జిల్లా అధ్యక్షుడు శివ గౌడ్, బీజేపీ నాయకులు అరుణ్ లోయ, ఏబీవీపీ పట్టణ కార్యదర్శి రాకేష్, జాయింట్ సెక్రటరీ ప్రీతమ్, కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కెరమెరిలో పేదలకు అందని గ్యాస్ కనెక్షన్లు

- కొత్త దరఖాస్తులకు మోక్షమెప్పుడు
- ఉజ్వల పథకం ఉన్నా లబ్ధి పొందలేని నిరుపేదలు
- కట్టెల పొయ్యిలే దిక్కు.. పొగతో అనారోగ్య సమస్యలు



ఉద్యమ కెరటం, కెరమెరి: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉజ్వల యోజన, ఇతర గ్యాస్ సబ్సిడీ పథకాలు ఉన్నప్పటికీ కెరమెరి మండలంలోని నిరుపేదలకు వంట గ్యాస్ కనెక్షన్లు అందని ద్రాక్షగా మారుతున్నాయి. కొత్తగా గ్యాస్ కనెక్షన్లు పొందాలనుకునే పేద కుటుంబాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరిగినా కొత్త దరఖాస్తులు స్వీకరించడం లేదనే సమాధానం వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కట్టెల పొయ్యిలే దిక్కు..

గ్యాస్ కనెక్షన్లు లేకపోవడంతో అనేక నిరుపేద కుటుంబాలు ఇప్పటికీ కట్టెల పొయ్యిలపైనే ఆధారపడి వంట చేసుకుంటున్నాయి. పొయ్యిల నుంచి వెలువడే పొగతో మహిళలు, చిన్నారులు కంటి మంట, శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు కట్టెల ధరలు పెరగడంతో పేద కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ఇప్పటికే గ్యాస్ కనెక్షన్లు ఉన్నవారికి సబ్సిడీలు సకాలంలో అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలు ఉండగా, కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే వారికి అవకాశం లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఉజ్వల పథకానికి అర్హులైన నిరుపేద కుటుంబాలను గుర్తించి కొత్త కనెక్షన్లు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్నప్పుడు వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కెరమెరి మండలంలో కొత్త గ్యాస్ కనెక్షన్ల దరఖాస్తుల స్వీకరణను వెంటనే ప్రారంభించాలని, గ్యాస్ ఏజెన్సీలు, సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



యువ పర్వతారోహకుడు గిట్టె కార్తీక్‌కు పోలీసుల అభినందనలు

ఉద్యమ కెరటం, కెరమెరి: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన యువ పర్వతారోహకుడు గిట్టె కార్తీక్ ఇటీవల అరుణాచల్ ప్రదేశ్‌లో నిర్వహించిన హై ఆల్టిట్యూడ్ ఎక్స్‌ప్లోరేటరీ ట్రెక్ లో పాల్గొని విజయవంతంగా తన యాత్రను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయనను మంగళవారం ఉట్నూర్ సీఐ, ఎస్సైతో పాటు జైనూర్ సీఐ రమేష్ అభినందించారు. మంగళవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఇండియన్ మౌంటెనీరింగ్ ఫౌండేషన్, భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్, అరుణాచల్ ప్రదేశ్ నిర్వహించిన ఈ సాహస యాత్ర అక్టోబర్ 9 నుంచి 20వ తేదీ వరకు దిరాంగ్ ప్రాంతంలో కొనసాగింది. కార్తీక్ మొత్తం 76 కిలో మీటర్ల మేర పర్వత మార్గాల్లో ప్రయాణించి, సుమారు 10వేల అడుగుల ఎత్తులో ఉన్న శిఖరాన్ని అధిరోహించే సాహస కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైనూర్ సీఐ రమేష్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే పర్వతారోహణ రంగంపై ఆసక్తి పెంచుకుని జాతీయ స్థాయి సాహస యాత్రలో పాల్గొని విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో ఎవరెస్టు అధిరోహించి జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.





ఉద్యమ కెరటం
నిజం రక్షణే లక్ష్యం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

మంచిర్యాలలో బియ్యం మాఫియా మాయాజాలం..!

- బ్రాండ్లు మార్చి బస్తాల బరువులో కోత.. ధరల్లో వినియోగదారుడికి బాదుడు
- 26 కిలోల బస్తాలో 24 నుంచి 25 కిలోలే అన్న ఆరోపణలు
- ట్రేడ్ లైసెన్సులు లేకుండానే వ్యాపారాల నిర్వహణ
- అధికారుల తనిఖీలు కరువు.. వ్యాపారుల ఇష్టారాజ్యం









ఉద్యమ కెరటం, మంచిర్యాల: బియ్యం కొనాలంటే సామాన్యుడు ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి జిల్లాలో నెలకొంది. ఒకవైపు కిలో బియ్యం ధర రూ.90 దాటుతుంటే.. మరోవైపు బస్తాల బరువులో కోతలు, బ్రాండ్ల పేరుతో ధరల వ్యత్యాసాలు ఉన్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. బస్తాపై 26 కిలోలు అని ముద్రించి లోపల 24 నుంచి 25 కిలోలే ఉంటే మిగిలిన బియ్యం ఏమవుతున్నాయనే ప్రశ్న తలెత్తుతుంది. బ్రాండ్ పేరు మార్చితే నాణ్యత మారకపోయినా రేటు మారుతుంది. ప్యాకింగ్ మార్చి ధర పెంచితే సామాన్యుడు కొనలేని పరిస్థితి నెలకొంటుంది. బియ్యం వ్యాపారంలో పారదర్శకత లేక సామాన్యుడి అవసరమే వ్యాపారుల లాభాలకు పెట్టుబడిగా మారుతున్న పరిస్థితి జిల్లాలో దాపురించింది.

బియ్యం మార్కెట్‌లో అనేక బ్రాండ్లు..

బియ్యం మార్కెట్‌లో బ్రాండ్ల పేర్లు పెరుగుతున్నాయి.. ప్యాకింగ్‌లు మారుతున్నాయి.. ధరలు మాత్రం వినియోగదారుడి జేబును ఖాళీ చేస్తున్నాయి. ఒకే రకమైన బియ్యాన్ని వేర్వేరు బ్రాండ్ల పేర్లతో విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బియ్యం నాణ్యతలో తేడా లేకున్న బ్రాండ్ల పేరుతో అదనపు ధర వసూలవుతోంది. వినియోగదారుడికి అసలు నాణ్యత వివరాలు తెలియక కొనుగోలు చేస్తూ మోసపోతున్నారు. బ్రాండ్ ముసుగులో ధరల ఆట సాగుతుంటే సంబంధిత శాఖల అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నార నే ఆరోపణలు ఉన్నాయి.

బియ్యం బస్తాల్లో కోతలు..

26 కిలోల బస్తాలో 24 నుంచి 25 కిలోలే ఉంటున్నాయన్న ఆరోపణలు నిజమైతే ప్రతి బస్తాలోనూ వినియోగదారుడికి నష్టం జరిగినట్టే. వందల బస్తాల వ్యాపారంలో ఈ తేడా ఎంత పెద్ద మొత్తానికి చేరుతుంది. తూకం వేసి విక్రయించాల్సిన బియ్యంలోనే తూకం తేడాలుంటే తూనికలు, కొలతల శాఖ అధికారులు ఇప్పటివరకు ఎందుకు పట్టించుకోవడం లేదనే ఆరోపణ లు వ్యక్తం అవుతున్నాయి. ఒకప్పుడు కుటుంబానికి అవసరమైన బియ్యం కొనుగోలు చేయడం పెద్ద భారంగా ఉండేది కాదు. ఇప్పుడు కిలో బియ్యం ధర రూ.90కు పైగా పలుకుతోందన్న ఆందోళన వినియోగదారుల్లో వ్యక్తమవుతుంది. నెలకు 30 కిలోల బియ్యం కొనుగోలు చేసే కుటుంబం రూ.2,700కు పైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. రోజువారీ కూలీపై ఆధారపడే కుటుంబాలు ఇంత భారం మోయలేక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న ప్రజలకు బియ్యం ధరలు మరో గుదిబండగా మారుతున్నాయి.

లైసెన్సులు లేవు.. తనిఖీలు లేవు

కొన్ని వ్యాపార సంస్థలకు ట్రేడ్ లైసెన్సులు లేవన్న అంశం కూడా చర్చకు వస్తోంది. నిజంగా లైసెన్సులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని సమాచారం. సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సామాన్యుడు ప్రశ్నిస్తున్నాడు. మున్సిపల్ శాఖకు ఈ వ్యవహారం తెలిసి కూడా మామూలుగా తీసుకొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సామాన్యుడి చిన్న దుకాణంపై నిబంధనల పేరుతో చర్యలు తీసుకునే యంత్రాంగం పెద్ద వ్యాపార సంస్థల విషయంలోనూ అదే స్థాయిలో ఎందుకు వ్యవహరించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మంత్రి ఆదేశాలు బేఖాతరు..

బీపీటీ బియ్యం ధర కిలో రూ.66 మించకుండా చూడాలన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలవ్వడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వ ప్రకటనలు ప్రజలకు ఊరటనిస్తుంటే మార్కెట్‌లో మాత్రం అధిక ధరలపై నియంత్రణ లేకపోవడం గమనార్హం. ధరల నియంత్రణపై సమావేశాలు నిర్వహిం చడం, ఆదేశాలు జారీ చేయడం ద్వారా ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు.

మూడు శాఖలు రంగంలోకి దిగితేనే అక్రమాలకు అడ్డుకట్ట..

మంచిర్యాల బియ్యం మార్కెట్‌లో జరుగుతున్నాయన్న ఆరోపణలపై పౌరసరఫరాల శాఖ, తూనికలు–కొలతల శాఖ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. బియ్యం బస్తాల అసలు బరువు, ప్యాకింగ్‌పై ముద్రించిన వివరాలు, బ్రాండ్ల మధ్య నాణ్యతా వ్యత్యాసాలు, విక్రయ ధరలు, వ్యాపార సంస్థల ట్రేడ్ లైసెన్సులను క్షుణ్ణంగా పరిశీలించాలి. తూకంలో తేడాలు, తప్పుడు లేబుళ్లు, నిబంధనల ఉల్లంఘనలు బయటపడితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. కేవలం తనిఖీల పేరుతో హడావుడి కాకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని వినియోగదారులు కోరుతున్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని బియ్యం బస్తాల వెనుక జరుగుతున్న వ్యవహారాలపై చూసీచూడనట్లు వ్యవహరించకుండా ప్రత్యేక తనిఖీలు చేపట్టి సామాన్యులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.





విద్యార్థులతో కలిసి స్టెప్పులు వేసిన విదేశీయులు

- ఆశ్రమ పాఠశాలలో సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తాం.. మౌలిక సదుపాయాలకు సహకరిస్తాం

ఉద్యమ కెరటం, జైనూర్: జైనూర్ మండలం రాసిమెట్ట బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం జర్మనీ దేశానికి చెందిన మిస్టర్ రైఫ్ హెల్మాన్, డాక్టర్ నోరెబెర్ట్, డోరోతీ, ఆగ్నేష్, జోసెఫ్ వాచ్, ఆమో, జీన్స్ క్రోమ్మింగా, మిస్టర్ శ్రీరంగరాజన్ తదితరులు సందర్శించారు. చేతన్ గుడ్ టెక్స్టైల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వచ్చిన వారికి పాఠశాల విద్యార్థినులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. పాఠశాలలో సోలార్ లైట్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థినులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినులు తమ సాంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించేలా గిరిజన నృత్యాలను ప్రదర్శించారు. విద్యార్థినులతో కలిసి విదేశీ అతిథులు కూడా ఉత్సాహంగా నృత్యం చేయడంతో పాఠశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. తమ సాంప్రదాయ నృత్యంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని విదేశీ అతిథులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సరమేడి దుందిరావు మాట్లాడుతూ తమ ప్రాంతంలోని ఆశ్రమ పాఠశాలను విదేశీ అతిథులు సందర్శించడం అభినందనీయమని, ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని పాఠశాలలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు తిరుపతి, హెచ్ఎం అనిత, సీఐ రమేష్, డాక్టర్ అశోక్, సరమేడి దుందిరావు, సర్పంచ్ ఉయిక చందు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను క్షేత్రస్థాయికి విస్తరించి నిరుపేదలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని గిరిజన గ్రామాల్లో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయాలని, డిసెంబర్లో ప్రత్యేక రక్తదాన శిబిరం నిర్వహించి బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదును విస్తృతం చేయాలని తెలిపారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సేవా కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన విద్యా సంస్థలకు జనవరి 12న గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు అందించనున్నట్లు వివరించారు. రెడ్‌క్రాస్ పాత భవనానికి మరమ్మతులు చేపట్టడంతో పాటు సంస్థకు కేటాయించిన స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ఆర్.క్రాంతి కుమార్, వైస్ చైర్మన్ మనోహర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఏదులాపురంలో రూ.5.19 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఉద్యమ కెరటం, ఖమ్మం: అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీలోని 25, 26వ వార్డుల్లో రూ.2.49 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, ఖమ్మం రూరల్ మండలంలోని గుర్రాలపాడు–కోట నారాయణపురం రోడ్డు నుంచి ఆబాండ్షిప్ వరకు రూ.2.70 కోట్లతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకపోయినా పేద ప్రజల సంక్షేమానికి అవసరమైన పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులు ఎక్కడా కుంటుపడకుండా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, నిరుద్యోగులకు భరోసా, భద్రత కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత పాలకుల హయాంలో కృష్ణా, గోదావరి జలాల వినియోగంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా విషయంలో గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నారని తెలిపారు. తెలంగాణకు రావాల్సిన కృష్ణా, గోదావరి జలాల వాటాను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు, దుష్ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన సమాధానం చెబుతారని మంత్రి అన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ గత 45 రోజుల వ్యవధిలోనే ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.40 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో లబ్ధిదారులకు ఎదురవుతున్న ఎల్-3 నుంచి ఎల్-1 సమస్యలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం త్వరలోనే పరిష్కరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ జి.వెంకట్ రెడ్డి, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీఓ ఎన్.శ్రీనివాస్, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా దేవసాని కృష్ణ



ఉద్యమ కెరటం, గంభీరావుపేట: భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధికార ప్రతినిధిగా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన దేవసాని కృష్ణ నియమితులయ్యారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి జిల్లా అధికార ప్రతినిధులను నియమించగా, అందులో దేవసాని కృష్ణకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా దేవసాని కృష్ణ నియామకం పట్ల గంభీరావుపేట మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బీజేపీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.

29న కాగజ్‌నగర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం



ఉద్యమ కెరటం, కౌటాల: సిర్పూర్(టి) సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పునర్నిర్మాణం కోసం భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు ఈనెల 29న కాగజ్‌నగర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం కౌటాల మండల కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వివిధ సంఘాల నాయకులు సమావేశానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. గురుకుల పాఠశాల పునర్నిర్మాణం ఆవశ్యకత, తదుపరి చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 29న మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కాగజ్‌నగర్‌లోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి మేధావులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, దళిత బహుజన ప్రజా సంఘాల నాయకులు, అఖిలపక్ష పార్టీల ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. గురుకుల పాఠశాల పునర్నిర్మాణానికి అందరూ ఐక్యంగా ముందుకు వచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పంట రక్షణ పేరుతో ప్రాణాలతో చెలగాటం వద్దు

ఎస్సై బాలరాజు



ఉద్యమ కెరటం, గంభీరావుపేట: పంటల రక్షణ పేరుతో వ్యవసాయ పొలాల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చడం అత్యంత ప్రమాదకరమని ఎస్సై బాలరాజు హెచ్చరించారు. ఇలాంటి చర్యలతో రైతులతో పాటు వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు, పశువుల ప్రాణాలకు సైతం ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. విద్యుత్ తీగల కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రైతులు పంటల రక్షణ కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదకరమైన, చట్టవిరుద్ధమైన పద్ధతులను ఆశ్రయించవద్దని కోరారు. పంటలను జంతువుల నుంచి కాపాడుకునేందుకు సురక్షితమైన, చట్టబద్ధమైన ప్రత్యామ్నాయ మార్గాలను మాత్రమే అనుసరించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి రైతు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో కాకడ హారతి



ఉద్యమ కెరటం, కెరమెరి: మండల కేంద్రంలోని ఆలయంలో కాకడ హారతి కార్యక్రమాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలమాలలు, మామిడి ఆకుల తోరణాలతో సుందరంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి పాటలు ఆలపిస్తూ మంగళహారతులతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురుషులు, యువతీ యువకులు సైతం భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దీపాల వెలుగులు, భక్తుల ప్రార్థనలు, భక్తి గీతాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామి వారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు బలైన యువకుడు

- పొలం చుట్టూ అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారని ఆరోపణలు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యుల డిమాండ్





ఉద్యమ కెరటం, గంభీరావుపేట: మండలంలోని మల్లారెడ్డిపేట గ్రామ శివారులో విషాద ఘటన చోటుచేసుకుంది. వరి నారుమడి చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల కారణంగా విద్యుత్ షాక్ తగిలి బండలింగంపల్లి గ్రామానికి చెందిన రేపాక రమేష్(28) మృతిచెందాడు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. బండలింగంపల్లి గ్రామానికి చెందిన రేపాక రమేష్ ఆటో నడుపుతూ, వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతుడి అన్న రేపాక దేవరాజు తెలిపిన వివరాల ప్రకారం.. తమ వ్యవసాయ భూమి పక్కనే మాచర్ల నర్సయ్య అనే వ్యక్తి జంగ వెంకట్రామిరెడ్డికి చెందిన భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడని తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో తమ చిన్న బాబాయి రేపాక నర్సయ్య వచ్చి రమేష్ వరి నారుమడి వద్ద విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు సమాచారం అందించాడని పేర్కొన్నారు. వెంటనే కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా, రమేష్ కుప్పకూలి కనిపించాడని తెలిపారు. నారుమడి చుట్టూ ఇనుప తీగలు ఏర్పాటు చేసి వాటికి విద్యుత్ సరఫరా అయ్యేలా చేసినట్లు గుర్తించామని, రమేష్ కుడిచేతి వేళ్లకు కాలిన గాయాలు ఉన్నాయని వెల్లడించారు. పంటలను అడవి జంతువుల నుంచి రక్షించుకునే పేరుతో పొలం చుట్టూ ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడంతోనే ఈ ఘటన జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి ప్రమాదానికి గల కారణాలను వెలికితీయాలని, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి అన్న రేపాక దేవరాజు డిమాండ్ చేశారు.

ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు
- గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

ఉద్యమ కెరటం, గంభీరావుపేట: ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అంకితభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, నిర్వహణ రికార్డులు, వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది విధుల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులను సావధానంగా విని సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులపై నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, నిర్ణీత సమయంలో కేసులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ సాంకేతిక అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. శాఖకు సంబంధించిన వెబ్ అప్లికేషన్లను సమర్థవంతంగా వినియోగించుకుంటూ విధులను మరింత వేగవంతంగా నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఆయన వెంట డీఎస్పీ నాగేంద్రచారి, గంభీరావుపేట ఎస్సై ఆర్.బాలరాజు, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



మధిరలో మట్టి లారీల బీభత్సం

- ప్రమాదాలకు నిలయంగా మారుతున్న రహదారులు
- అధిక లోడ్ కారణంగా రోడ్లపై కుప్పలుగా పడుతున్న మట్టి
- వాహనదారులు ఇక్కట్లు.. అధికారుల పర్యవేక్షణ కరువు



ఉద్యమ కెరటం, ఖమ్మం: ఖమ్మం జిల్లా మధిర పట్టణంలో మట్టి లారీల రాకపోకలు ప్రజలకు ప్రమాదకరంగా మారుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్తో మట్టిని తరలిస్తున్న లారీలు రహదారులపై మట్టి కుప్పలుగా జారవిడుస్తుండటంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రహదారులపై మట్టి పేరుకుపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం పట్టణంలోని స్వర్ణభార్ సమీపంలో హైట్ లోడ్తో వెళ్తున్న ఓ మట్టి లారీ నుంచి భారీగా మట్టి రోడ్డుపై పడింది. లారీ కదులుతున్న సమయంలోనే మట్టి పెద్దఎత్తున రహదారిపై జారిపడటంతో ఆ ప్రాంతమంతా మట్టితో నిండిపోయింది. అదే సమయంలో లారీ వెనుక ఇతర వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లారీ నుంచి మట్టి పడుతుండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి వాహనాన్ని ఆపాలని కేకలు వేసినా డ్రైవర్ పట్టించుకోకుండా అతివేగంతో వెళ్లిపోయినట్లు తెలిపారు. మార్గమధ్యంలో మరికొన్ని ప్రాంతాల్లోనూ లారీ నుంచి మట్టి రోడ్డుపై పడినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజల భద్రతను ఏమాత్రం పట్టించుకోకుండా ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. రోడ్డుపై మట్టి పేరుకుపోవడంతో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు బ్రేకులు వేసే సమయంలో అదుపుతప్పి జారిపడే ప్రమాదం ఉంది. మలుపుల వద్ద, రద్దీగా ఉండే ప్రాంతాల్లో మట్టి కారణంగా వాహనాలు స్కిడ్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి..

మట్టి తరలించే లారీలు నిబంధనలకు అనుగుణంగా లోడ్తో ప్రయాణించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అధిక లోడ్తో మట్టి తరలించే వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, మట్టి రోడ్డుపై పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా డ్రైవర్లకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రహదారులపై పడిన మట్టిని వెంటనే తొలగించేలా సంబంధిత శాఖలు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న మట్టి లారీల నిర్లక్ష్యపు ప్రయాణానికి అడ్డుకట్ట వేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వాహన యజమానులు, డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదాలు జరగకముందే అధికారులు మేల్కొని మట్టి లారీల రాకపోకలపై నియంత్రణ విధించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- దంపతులు మృతి.. కుమారుడికి తీవ్రగాయాలు
- అన్నవరం దర్శనం ముగించుకుని వస్తుండగా ప్రమాదం



ఉద్యమ కెరటం, ఖమ్మం: ఖమ్మం జిల్లా వైరా సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైవేపై పార్కింగ్ ఏరియాలో కాకుండా రహదారిపై నిలిపి ఉంచిన లారీని కారు బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన దంపతులు మృతిచెందగా, వారి కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. మృతులను హైదరాబాద్‌కు చెందిన కిషోర్ రెడ్డి, లావణ్యగా అధికారులు గుర్తించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కుమారుడిని చికిత్స నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

రహదారిపై లారీల పార్కింగ్‌తో ప్రమాదాలు..

గ్రీన్‌ఫీల్డ్ హైవేపై లారీలు నిర్దిష్ట పార్కింగ్ ప్రాంతాల్లో కాకుండా రహదారిపై ఇతర ప్రాంతాల్లో నిలిపి ఉంచడం ప్రమాదాలకు కారణమవుతోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై నిలిపి ఉన్న లారీలను వెనుక నుంచి కార్లు, ఇతర వాహనాలు ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నాయని పేర్కొంటున్నారు. వరుస ప్రమాదాలతో ఈ హైవేపై ప్రయాణించాలంటేనే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ప్రయాణం ప్రాణసంకటంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత హైవే అధికారులు వెంటనే స్పందించి పార్కింగ్ ఏరియాలు మినహా ఇతర ప్రాంతాల్లో లారీలను నిలిపి ఉంచకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. రహదారిపై అక్రమ పార్కింగ్‌ను అరికట్టడంతో పాటు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు, తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. విలువైన ప్రాణాలు బలికాకముందే అధికారులు మేల్కొని చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆదిలాబాద్‌కు అదనంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కోరిన కాంగ్రెస్ నేతలు



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌లో డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్‌తో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా వెనుకబడిన ప్రాంతం కావడంతో పాటు అధిక సంఖ్యలో గిరిజన ప్రజలు నివసిస్తున్న నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాకు అదనంగా ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, జిల్లా అభివృద్ధికి రాష్ట్ర పార్టీ నాయకత్వం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, గండ్రత్ సుజాత, అల్లూరి సంజీవరెడ్డి, సాజిద్ ఖాన్, అడ్డి భోజారెడ్డి, కొమరం సత్యవతి కోటేష్, రాజు యాదవ్, ఏలేటి అశ్విన్ రెడ్డి, పరమేశ్వర్, బెజ్జంకి అనిల్ కుమార్, చరణ్ గౌడ్, మునిగేల నర్సింగ్, పసుల చంటి, గాజుల పోతన్నతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, పీఏసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



డైలాగులు లేవని ఆటపట్టించేవారు!

‘ఫ్యామిలీ ప్యాక్’తో పూర్తిస్థాయి వినోదాన్ని అందిస్తా

టీజర్ విడుదల కార్యక్రమంలో సాక్షి మడోల్కర్

హైదరాబాద్, నవంబర్ 24 (ఉద్యమ కెరటం): తొలి సినిమాలో డైలాగులు లేకపోవడంతో తన స్నేహితులు సరదాగా ఆటపట్టించేవారని యువ కథానాయిక సాక్షి మడోల్కర్ తెలిపారు. ఇప్పుడు ‘ఫ్యామిలీ ప్యాక్’ చిత్రంలో డైలాగులతోపాటు డ్యాన్స్‌లు కూడా చేస్తూ ప్రేక్షకులను అలరించబోతున్నానని చెప్పారు. సందీప్ రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘మోగ్లీ’ చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన సాక్షి.. తాజాగా శ్రీవిష్ణు సరసన ‘ఫ్యామిలీ ప్యాక్’లో నటిస్తున్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన చిత్ర టీజర్ విడుదల కార్యక్రమంలో సాక్షి తన అనుభవాలను పంచుకున్నారు. “శ్రీవిష్ణు కామెడీ టైమింగ్ అద్భుతంగా ఉంటుంది. ఆయనకు దీటుగా నటించడం చాలా కష్టమైంది. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. వినోదాత్మక చిత్రంలో నటించడం ఇదే తొలిసారి. నా పాత్రకు న్యాయం చేయాలనే బాధ్యత, ఒత్తిడి ఉన్నప్పటికీ చిత్రబృందం ఎంతో సహకరించింది. చిత్రీకరణ సరదాగా సాగింది” అని తెలిపారు. తన తొలి చిత్రంలో సంభాషణలు లేకపోవడంతో ‘ఏంటి.. నీకు డైలాగులే లేవా?’ అంటూ స్నేహితులు ఆటపట్టించేవారని సాక్షి గుర్తుచేసుకున్నారు. అయితే ‘ఫ్యామిలీ ప్యాక్’లో తన పాత్ర పూర్తిస్థాయిలో వినోదాన్ని పంచుతుందని చెప్పారు. మాట్లాడటంతోపాటు నృత్యాలతోనూ ప్రేక్షకులను అలరిస్తానని వెల్లడించారు. తన సినీ జీవితంలో సంక్రాంతికి విడుదలవుతున్న తొలి చిత్రం ఇదే కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సంక్రాంతిని ‘ఫ్యామిలీ ప్యాక్’తో అందరం కలిసి వేడుకగా జరుపుకుందామని అభిమానులకు పిలుపునిచ్చారు. తొలి టీజర్‌తోనే ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ చిత్రం 2027 సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

నిహారిక ‘పాకెట్ రాకెట్స్’

నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం ‘పాకెట్ రాకెట్స్’. రుద్ర అత్రి దర్శకత్వం వహిస్తున్నారు. త్రినాథ్ వర్మ, నిర్మల్, శ్రియా కొంతం, జేడీ చక్రవర్తి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. డిసెంబరు 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నది. ఈ నేపథ్యంలో మేకర్స్ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు. ‘అప్సర’ అనే పాటను రిలీజ్ చేశారు. గ్యాని ఈ దీనికి సంగీతం అందించారు.



ఇష్టం లేని సన్నివేశాల్లో నటించను!

నృత్యంపై ఇష్టంతోనే ఆ పాటకు అంగీకరించా

జాన్వీ కపూర్ అనుభవాలపై నేను మాట్లాడలేను

‘పెద్ది’ ప్రత్యేక గీతంపై శ్రుతి హాసన్ ఆసక్తికర వ్యాఖ్యలు



హైదరాబాద్, నవంబర్ 24 (ఉద్యమ కెరటం): ఇతరులను మెప్పించడం కోసం తనకు ఇష్టం లేని దుస్తులు ధరించడం, సన్నివేశాల్లో నటించడం చేయనని ప్రముఖ కథానాయిక శ్రుతి హాసన్ స్పష్టం చేశారు. రామ్ చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కిన ‘పెద్ది’ చిత్రంలో మహిళా పాత్రల చిత్రీకరణపై కొనసాగుతున్న చర్చ నేపథ్యంలో ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ చిత్రంలోని ‘హెల్లల్లలో’ ప్రత్యేక గీతంలో రామ్ చరణ్, జాన్వీ కపూర్‌తో కలిసి శ్రుతి హాసన్ సందడి చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆ పాటలో నటించడానికి అంగీకరించడం వెనుక కారణాలను వెల్లడించారు. సినిమాల్లో ప్రత్యేక గీతాలు అవసరమా అనే ప్రశ్న తనకు కూడా అప్పుడప్పుడు ఎదురవుతుందని శ్రుతి తెలిపారు. అయితే నృత్యం చేయడం, అందంగా ముస్తాబవడం తనకు ఎంతో ఇష్టమని, అందుకే ‘పెద్ది’లో ప్రత్యేక గీతానికి అంగీకరించానని చెప్పారు. గ్లామర్ విషయంలో తనకు ఎలాంటి అభ్యంతరాలు లేవని, అయితే దుస్తులు, సన్నివేశాల విషయంలో అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే తన అభిప్రాయాన్ని వెల్లడిస్తానని పేర్కొన్నారు. ఈ విషయంలో గతంలో పలుమార్లు వాదనలు కూడా జరిగినట్లు తెలిపారు. ‘పెద్ది’ చిత్రంలో మహిళల చిత్రీకరణపై జరుగుతున్న చర్చను తాను అర్థం చేసుకోగలనని శ్రుతి చెప్పారు. అయితే తన వరకు పాటలోని నృత్యాన్ని ఆస్వాదించడమే ముఖ్యమన్నారు. జాన్వీ కపూర్‌తో కలిసి ఆ పాటలో నటించినప్పటికీ, చిత్రీకరణ సమయంలో ఆమెకు ఎదురైన అనుభవాల గురించి తాను మాట్లాడలేనని స్పష్టం చేశారు. ఎవరి అనుభవాలను వారే వెల్లడించడం సమంజసమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన ‘ఆకాశంలో ఒక తార’ చిత్రంలో విభిన్నమైన పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకున్న శ్రుతి హాసన్.. తాజాగా ‘పెద్ది’ ప్రత్యేక గీతంపై చేసిన వ్యాఖ్యలతో మరోసారి వార్తల్లో నిలిచారు.



అర్జున్ కుమార్తెపై అనుచిత వ్యాఖ్యలు..

నటుడు బయిల్వాన్ రంగనాథన్‌పై కేసు

తన పెద్ద కుమార్తె, నటి ఐశ్వర్యపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారంటూ.. నటుడు, యూట్యూబర్ బయిల్వాన్ రంగనాథన్‌పై అర్జున్ సర్జా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చెన్నై సైబర్ క్రైమ్ పోలీసులు రంగనాథన్‌తో పాటు మరో వ్యక్తిపై మూడు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇటీవల తన చిన్న కుమార్తె అంజనా వివాహం జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ వేడుకకు పెద్ద కుమార్తె ఐశ్వర్య హాజరు



కాకపోవడంపై సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. కొందరు దీనికి సంబంధించిన వీడియోలు, వ్యక్తిగత జీవితంపై ఆధారాలు లేని ఆరోపణలు ప్రచారం చేశారు. ఈ క్రమంలో ఐశ్వర్య వ్యక్తిగత అలవాట్ల గురించి కూడా అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు అర్జున్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇలాంటి ఆరోపణలు చేయడం వల్ల తన కుమార్తె ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అర్జున్ ఫిర్యాదు నేపథ్యంలో చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన సైబర్ క్రైమ్ విభాగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. మూడు సెక్షన్ల కింద బైల్వాన్ రంగనాథన్‌తో పాటు మరొకరిపై కేసు నమోదు చేసింది. ఈ క్రమంలో విచారణకు హాజరుకావాలని రంగనాథన్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయన పోలీసు కార్యాలయానికి హాజరయ్యారు. అక్కడ అధికారులు ఆయనను ఏడు గంటలకు పైగా విచారించినట్లు సమాచారం.

నా పెళ్లి ఎప్పుడైంది బాబూ?

నెటిజన్ వ్యాఖ్యకు డింపుల్ హయాతి సరదా కౌంటర్

హైదరాబాద్, నవంబర్ 24 (ఉద్యమ కెరటం): తనకు పెళ్లయిందంటూ ఓ నెటిజన్ చేసిన వ్యాఖ్యపై టాలీవుడ్ కథానాయిక డింపుల్ హయాతి సరదాగా స్పందించారు. తనకు ఇంకా పెళ్లి కాలేదంటూ ఆమె ఇచ్చిన సమాధానం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. శర్వానంద్ కథానాయకుడిగా నటించిన ‘భోగి’ చిత్రం ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల నిర్వహించిన విడుదల ముందస్తు వేడుకలో డింపుల్ హయాతి పాల్గొని సందడి చేశారు. ఈ వేడుకలో వేదికపై శర్వానంద్‌తో డింపుల్ సరదాగా మాట్లాడుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఓ మీమ్ పేజీ ఈ వీడియోను పంచుకోగా పలువురు నెటిజన్లు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఓ నెటిజన్ ‘శర్వానంద్‌లాగే డింపుల్ హయాతికి కూడా పెళ్లయిపోయింది కదా’ అంటూ వ్యాఖ్యానించాడు. దీనిపై స్పందించిన డింపుల్ తనకు ఇంకా పెళ్లి కాలేదంటూ సరదాగా బదులిచ్చారు. డింపుల్ ఇచ్చిన సమాధానంతో ఆమె వివాహంపై వచ్చిన ఊహాగానాలకు తెరపడింది. నెటిజన్ వ్యాఖ్యకు ఆమె స్పందించిన తీరు అభిమానులను ఆకట్టుకుంటోంది. మరోవైపు ఈ వీడియోతో ‘భోగి’ చిత్రానికి సామాజిక మాధ్యమాల్లో అదనపు ప్రచారం లభించిందని సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**